Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్ : 9440815774

Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 114 | Friday 04.04.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి : 6 | సంచిక : 114 | శుక్రవారం 04. 04. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4

వైసీపీ కుట్రలతో...

# రాజధానికి జాప్యం

## అమరావతి కోసం ప్రపంచ బ్యాంక్ నిధులు వచ్చేశాయ్..



వెలగపూడి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** రాజధాని అమరావతి నిర్మాణంలో కీలక అడుగు పడింది. ప్రపంచ బ్యాంకు నుంచి తొలి విడత రుణం కింద రూ.3,535 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జమయ్యాయి. తాజాగా ప్రపంచ బ్యాంకు నిధులు విడుదల చేయడంతో త్వరలో ఆసియన్ డెవల్‌పమెంట్ బ్యాంకు(ఏడీబీ) నుంచి కూడా మొదటి విడత రుణం విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. రాజధాని కోసం ప్రపంచ బ్యాంకు రూ.6,700 కోట్లు, ఏడీబీ రూ.6,700 కోట్లు కలిపి మొత్తం రూ.13,600 కోట్లు అప్పుగా ఇస్తున్నాయి. మరో రూ.1,400 కోట్లను కేంద్రం ఏపీకి ప్రత్యేక సాయంగా అందిస్తోంది. ఈ నిధులను రాష్ట్ర రుణ పరిమితిలో (ఎఫ్ఆర్‌బీఎం) లెక్కించకూడదని కేంద్రం నిర్ణయించింది. హడ్కో నుంచి రూ.11,000 కోట్ల రుణ సమీకరణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. దానికి సంబంధించి అనుమతి లేఖ కూడా రాష్ట్రానికి వచ్చింది. అలాగే, జర్మనీకి చెందిన ఆర్థిక సంస్థ నుంచి మరో రూ.5,000 కోట్ల రుణాలు తీసుకునేందుకు మిగతా 2 లో

అడుదాం ఆంధ్రలో ఎలాంటి...

# అవినీతి జరగలేదు

## : మాజీ మంత్రి రోజా

ఆ వ్యవహారంలో నాకు, సిద్ధార్థరెడ్డికి సంబంధం లేదు: రోజా
వైసీపీలోని బలమైన నేతలపై కేసులు పెడుతున్నారని విమర్శ
ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వం పని చేయాలని హితవు



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై ఇంతవరకు కేసులు నమోదు కాలేదని వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి అసెంబ్లీలో అన్ని విషయాలు స్పష్టంగా చెప్పామని తెలిపారు. ఆడుదాం ఆంధ్రలో ఎలాంటి అవినీతి జరగలేదని... అంతా నిబంధనల ప్రకారమే జరిగిందని చెప్పారు. ఈ మిగతా 2 లో

ట్రంప్ విధించిన సుంకాలపై కేంద్ర ప్రభుత్వం...

# స్పందించాలి

## : రాహుల్ గాంధీ

కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని డిమాండ్
రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన అనురాగ్ ఠాకూర్



న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ ఉత్పత్తులపై విధిస్తున్న సుంకాల విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పందించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ, అమెరికా సుంకాలు మన ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోబోతుందో స్పష్టం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ భారత్-చైనా సరిహద్దు వివాదాన్ని ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. చైనా మన దేశానికి చెందిన 4 వేల కిలోమీటర్లకు పైగా భూభాగాన్ని ఆక్రమించిందని, దీనిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బీజింగ్ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిసిందని ఆయన అన్నారు. ఆక్రమిత మిగతా 2 లో

పోలీసులకు సహకరించని...

# మాజీ మంత్రి



నెల్లూరు, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** అక్రమ మైనింగ్ కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి హైడ్రామా కొనసాగుతోంది. పోలీసులకు సహకరిస్తానని.. విచారణకు వస్తానని చెబుతూనే తప్పించుకుని తిరుగుతున్నారు మాజీ మంత్రి. మూడవ సారి కూడా పోలీసుల విచారణకు కాకాణి గైర్హాజరయ్యారు. అక్రమమైనింగ్ కేసులో ఇప్పటి వరకు మూడు సార్లు కాకాణికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆయనను కలిసి నోటీసులు ఇవ్వాలని పోలీసులు ప్రయత్నించిన ప్రతీసారి కాకాణి మాత్రం తప్పించుకుని తిరుగుతూనే ఉన్నారు. దీంతో ఆయన బంధువులకు నోటీసులు ఇస్తున్నారు పోలీసులు. నిన్న(బుధవారం) కూడా కాకాణి హైదరాబాద్‌లో ఉన్నారని పక్కా సమాచారంతో ఏపీ పోలీసులు ఎస్ఆర్‌నగర్‌లోని నివాసానికి మిగతా 2 లో

మాకు ఎవరి కితాబు...

# అవసరం లేదు




హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** పర్యావరణం విషయంలో తమకు కొత్తగా ఎవరి కితాబు అవసరం లేదని బీఆర్ఎస్ నేత కేటీఆర్ స్పష్టం చేశారు. హెచ్ మిగతా 2 లో

అన్నింటిపై అప్రమత్తంగా ఉంటూ.. కుట్రలను...

# తిప్పికొడదాం

మంత్రులకు సీఎం చంద్రబాబు కీలక సూచనలు
అమరావతిలో సింగపూర్ బృందం .. సీఎం చంద్రబాబు, లోకేశ్‌తో భేటీ



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** పాస్టర్ ప్రవీణ్ మరణం విషయంలో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని వైసీపీ చూస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శించారు. కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులతో ప్రత్యేకంగా భేటీ అయిన సీఎం.. పలు రాజకీయ అంశాలను ప్రస్తావించారు. ప్రవీణ్ మరణానికి సంబంధించి సీసీ కెమెరాల్లో ఒక్కో అంశం బయటకు వస్తోందన్నారు. ప్రవీణ్ డెత్ మిస్టరీ ఛేదనలో సీసీ కెమెరాలది కీలక పాత్ర అని చెప్పుకొచ్చారు. మనం అప్రమత్తంగా లేకుంటే.. బాబాయ్ గొడ్డలి, కోడికత్తి, గులకరాయి తరహాలో అన్నీ మనపైనే వేస్తారని అన్నారు. చేసిన మంచి చెప్పుకోవడానికి ఇబ్బందులు పడుతుంటే లేని నిందలు మనపై వేసే కుట్రలు చేస్తున్నార మిగతా 2 లో



ఇచ్చిన మాట ప్రకారమే పేదలకు...

# 'పట్టా'భిషేకం

పేదలకు ఉచితంగా శాశ్వత గృహ పట్టాలు
గోవిందు అనే వ్యక్తి కుటుంబానికి స్వయంగా పట్టా అందించిన మంత్రి లోకేశ్
ముఖ్యమైన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందని వెల్లడి
మంగళగిరిని టీడీపీ కంచుకోటగా మార్చుతానని స్పష్టీకరణ

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఉండవల్లిలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు ఉచితంగా శాశ్వత గృహ పట్టాలను అందించే మిగతా 2 లో

అవినాశ్ బెయిల్ పై ఉండటం వల్లే సునీతకు....

# న్యాయం జరగడం లేదు

హత్య జరిగినప్పుడు అక్కడ అవినాశ్ రెడ్డి ఉన్నారన్న షర్మిల




అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు గురించి ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి బెయిల్ పై బయట ఉంటూ సాక్షులను బెదిరిస్తున్నారని అన్నారు. వివేకా హత్య కేసులోని సాక్షులు ఒక్కొక్కరుగా ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వివేకా కూతురు సునీత ప్రాణాలకు కూడా రక్షణ లేదని షర్మిల మిగతా 2 లో

# సంపాదకీయం

## ట్రంప్ అన్నంత పనిచేశారుగా...

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భారత్ వంటి దేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తామని పలు సందర్భాల్లో హెచ్చరించిన డొనాల్డ్ ట్రంప్ అన్నంత పని చేశారు. భారత్ సహా వివిధ దేశాలపై ప్రతీకార సుంకాలను అమలులోకి తీసుకొచ్చారు. అమెరికా దేశ భవిష్యత్తు అమెరికన్ల చేతుల్లోనే ఉందని మరోసారి నొక్కి చెప్పారు. భారత్ సహా ఇతర దేశాలు తమపై విధిస్తున్న సుంకాల్లో తాము సగమే విధిస్తున్నాని, ఆయా దేశాలపై జాలితోనే ఇలా సగం సుంకాలు ప్రకటించినట్లు ట్రంప్ తెలిపారు. వీటిని రాయితీ టారిఫ్‌లుగా పేర్కొన్నారు. అయితే, భారత్‌పై ఇక తాము 26 శాతం మేర సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురించి ప్రస్తావిస్తూ మోదీ తనకు గొప్ప స్నేహితుడని, అయితే భారత్ అమెరికాతో సరైన విధంగా వ్యవహరించడం లేదన్నారు. అమెరికాపై 52 శాతం మేర సుంకాలు విధిస్తోందని మరోసారి గుర్తు చేశారు. మరోవైపు.. చైనాపై 34 శాతం మేర సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. అమెరికాకు దిగుమతి అయ్యే అన్ని దేశాల ఉత్పత్తులపై కనీసం 10 శాతం సుంకాలు ఉంటాయని ప్రకటించారు. ఉత్పత్తులపై అమెరికా ప్రతీకార సుంకాలు విధించడం వల్ల ఫార్మా, వ్యవసాయం, రసాయనాలు, మెడికల్ డివైజెస్, ఎలక్ట్రికల్, మెషినరీ వంటి కీలక రంగాలపై ప్రతికూల ప్రభావం పడనుందని నిపుణులు చెబుతున్నారు. వియత్నాం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై ఏకంగా 46 శాతం సుంకాలు విధిస్తున్నట్లు చెప్పారు ట్రంప్. స్విట్జర్లాండ్‌పై 31 శాతం, తైవాన్ పై 32 శాతం, బ్రిటన్ పై 10 శాతం, బ్రెజిల్ పై 10 శాతం, ఇండోనేషియాపై 32 శాతం, సింగపూర్‌పై 10 శాతం, దక్షిణాఫ్రికాపై 30 శాతం మేర ప్రతీకార సుంకాలు ప్రకటించారు. భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది కూడా దాదాపు 18 శాతం ఉత్పత్తులు ఎగుమతి అవుతాయి. ఈ సుంకాలు అమల్లోకి వచ్చిన తర్వాత, ఈ దిగుమతుల ధరలు పెరిగి, అమెరికా మార్కెట్‌లో వాటి పోటీదనాన్ని తగ్గించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఈ క్రింది రంగాల్లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించవచ్చు. భారతదేశం ప్రపంచానికి ప్రధానంగా జనరిక్ ఔషధాలను సరఫరా చేసే దేశంగా ఉంది. అమెరికా మార్కెట్‌లో భారతీయ ఔషధ కంపెనీలు గొప్ప స్థాయిలో పోటీ చేస్తున్నాయి. అయితే 26% సుంకం వల్ల ఈ ఉత్పత్తుల ఖర్చులు పెరిగి, వాటి ధరలు ఎక్కువయ్యే అవకాశముంది. ఫలితంగా, అమెరికాలో భారత ఔషధాల అమ్మకాలు తగ్గొచ్చు. భారతదేశం అమెరికాకు భారీగా వస్త్రాలను ఎగుమతి చేస్తుంది. భారతీయ కాటన్, రేష్మి, ఇతర వస్త్ర ఉత్పత్తులు అమెరికా మార్కెట్‌లో ప్రముఖ స్థానాన్ని కలిగి ఉన్నాయి. అయితే, సుంకాల కారణంగా ధరలు పెరిగితే, ఇతర దేశాల పోటీ పెరిగి, భారత వస్త్ర వ్యాపారంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. భారతదేశం నుంచి అమెరికాకు పెద్ద మొత్తంలో ఆటో విడిభాగాలను ఎగుమతి చేస్తోంది. ఈ కొత్త సుంకాలు భారత ఆటోమొబైల్ పరిశ్రమను ప్రభావితం చేసి, అమెరికాలో భారతీయ ఆటో భాగాల వినియోగాన్ని తగ్గించవచ్చు. దీనివల్ల భారతదేశ ఆటోమొబైల్ కంపెనీలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. భారతదేశం నుంచి అమెరికాకు పెట్రోలియం ఉత్పత్తులు, రసాయన పదార్థాలు కూడా భారీగా ఎగుమతి అవుతున్నాయి. అయితే ఈ సుంకాల వల్ల, ఈ ఉత్పత్తులపై ఖర్చు పెరిగి, వాటి ఎగుమతికి ఆటంకం కలిగే అవకాశం ఉంది, భారతదేశం నుంచి అమెరికాకు ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, ఐటీ సంబంధిత హార్డ్‌వేర్ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ రంగంలో ఇప్పటికే చైనా వంటి దేశాలతో పోటీ ఎక్కువగా ఉంది. ఇప్పుడు సుంకాల కారణంగా, భారత ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల పోటీదనం మరింత తగ్గే అవకాశం ఉంది. భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది ఎగుమతి అయ్యే ఉత్పత్తులు గణనీయమైన భాగాన్ని కలిగి ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో, భారతదేశం మొత్తం ఎగుమతులు (వస్తువులు, సేవలు కలిపి) సుమారు 776 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇందులో అమెరికా భారతదేశం నుంచి ఎగుమతి చేసుకునే వస్తువుల విలువ సుమారు 77.5 బిలియన్ డాలర్లు (వస్తువులు మాత్రమే). ఇది భారతదేశం మొత్తం వస్తు ఎగుమతుల్లో (సుమారు 451 బిలియన్ డాలర్లు) దాదాపు 17-18% ఉంటుంది. అంటే భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది సుమారు 17-18% వస్తు ఉత్పత్తులు ఎగుమతి అవుతాయని చెప్పవచ్చు. ఈ ఉత్పత్తుల్లో ప్రధానంగా ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, ఆభరణాలు, టెక్స్‌టైల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఉంటాయి. దీంతో అమెరికా భారతదేశానికి అతిపెద్ద ఎగుమతి మార్కెట్‌గా ఉంది. ఆ తర్వాత యూఏఈ, చైనా వంటి దేశాలు ఉన్నాయి. ఇక భారతదేశం విదేశాల నుంచి దిగుమతులు చేసుకునే వస్తువుల్లో అమెరికా కీలకమైన భాగస్వామిగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో, భారత్ మొత్తం దిగుమతుల విలువ సుమారు 732 బిలియన్ డాలర్లు. ఇందులో అమెరికా నుంచి దిగుమతులు 42.12 బిలియన్ డాలర్లు, అంటే సుమారు 5.75%. అంటే, ప్రతి ఏడాది భారత్ దిగుమతులలో అమెరికా వాటా సుమారు 5-6%గా ఉంటుందిభారతదేశం అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ప్రధాన వస్తువులలో క్రూడ్ పెట్రోలియం (ముడి చమురు), బొగ్గు ఉత్పత్తులు (కోల్ బ్రికెట్స్) ,గ్యాస్ టర్బైన్స్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు ఉన్నాయి. అమెరికా భారత్‌కు ముఖ్యమైన వ్యాపార భాగస్వామిగా ఉన్నప్పటికీ, చైనా (17%), రష్యా (9%) పెద్ద వాటా కలిగి ఉండటం విశేషం. అయినప్పటికీ, అమెరికా నుంచి వచ్చే టెక్నాలజీ ఉత్పత్తులు, ఖరీదైన రత్నాలు, ఇంధన వనరులు భారత మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి.

## వైసీపీ కుట్రలతో...

ప్రయత్నాలు సాగుతున్నాయి.

**రాజధానిపై వైసీపీ కుట్రలతో జాప్యం :**
అమరావతి నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ చెరో రూ.6,700 కోట్ల చొప్పున రుణాన్ని గతేడాది డిసెంబరులో ఆమోదించాయి. దీనిలో భాగంగా ఈ ఏడాది జనవరిలోనే ప్రపంచ బ్యాంకు నుంచి మొదటి విడత అప్పు విడుదల కావాల్సి ఉంది. అయితే ఈ ప్రాంతం రాజధానిగా పనికిరాదని, అప్పు ఇవ్వొద్దంటూ కొందరు ఆ బ్యాంకుకు లేఖలు రాశారు. ఈ అభ్యంతరాలను పరిశీలించి నిర్ణయం తీసుకునేసరికి 2 నెలలు ఆలస్యమైంది. 2018లో కూడా వైసీపీ ఇలాంటి కుట్రలే చేసి అమరావతికి అప్పు రాకుండా అడ్డుపుల్లలు వేసింది. కానీ, ఈసారి వారి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. వాస్తవానికి 2018లోనే రాజధాని నిర్మాణానికి రుణం మంజూరు చేయడానికి ప్రపంచ బ్యాంకు అంగీకరించింది. కానీ ఆ నిధులు రాకుండా నాటి ప్రతిపక్ష నేత జగన్, విజయసాయిరెడ్డి కుట్రలు పన్నారు. అప్పటి ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేస్తూ ప్రపంచ బ్యాంకుకు లేఖలు రాశారు. అమరావతి వరదలకు మునిగిపోతుందని పదేపదే ఈ-మెయిళ్లు పంపారు. రాజధాని గ్రామాలతో సంబంధంలేని రైతులతోనూ ఫిర్యాదులు చేయించారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందంటూ ప్రచారం చేశారు. ఈ పరిణామాలతో ప్రపంచ బ్యాంకు వెనక్కి తగ్గింది. అనంతరం సీఎం అయిన జగన్ అమరావతి నిర్మాణానికి తమకు రుణం అక్కర్లేదని ప్రపంచ బ్యాంకుకు లేఖ రాశారు. 2014-19లో చేసుకున్న కాంట్రాక్టు అగ్రిమెంట్లను క్లోజ్ చేయకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్రంగా నష్టపోయారు. ఎన్టీఆర్ విగ్రహం, ఐకానిక్ బ్రిడ్జి, కరకట్ట రోడ్డు వంటి 19 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి విలువ రూ.16,871 కోట్లు. చంద్రబాబు సీఎం అయ్యాక వీటికి అంచనాలు తయారుచేశారు. 31 సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. పనులకు టెండర్లు కూడా ఖరారు చేశారు . ఇక ఇక్కడ నిర్మాణ పనులు ఈ నెల రెండో వారం నుంచి ప్రారంభం కానున్నాయి

## అన్నింటిపై అప్రమత్తంగా ఉంటూ..

మండిపడ్డారు. సోషల్ మీడియాలో మంచి ఉద్దేశంతో పోస్టులు పెడుతుంటే వాటిని వక్రీకరించి చెడు సందేశాలను వ్యాప్తి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నింటిపై అప్రమత్తంగా ఉంటూ కుట్రలను తిప్పికొడదామని మంత్రులకు సీఎం సూచించారు. గత వైసీపీ ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను ఆప్కాస్ ద్వారా దుర్వినియోగం చేసిందని విమర్శించారు. విచ్చలవిడి నియామకాలతో వ్యవస్థలను నాశనం చేశారన్నారు. ఒక టీటీడీలోనే 4వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు సరైన విధివిధానాలు అవసరమన్నారు. కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి ఔట్ సోర్సింగ్ నియామకాలను సక్రమ పద్ధతికి తీసుకొద్దామని తెలిపారు. స్వర్ణ గ్రామం పేరుతో ఉన్నతాధికారులు పల్లె నిద్ర చేయాలి అని సీఎం ఆదేశించారు. ఉన్నతాధికారులు 3 రోజులు, 2 రాత్రులు పల్లెనిద్ర చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి పల్లెనిద్ర, పల్లె వెలుగు, స్వర్ణ గ్రామం పేర్లు పరిశీలన చేయాలన్నారు. ఇరుగుపొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ ఇచ్చే సంక్షేమ పథకాలు నాలుగు రెట్లు అధికమని చెప్పుకొచ్చారు. ఇంత చేసి సరైన ప్రచారం చేసుకోలేక పోతున్నాం అని కేబినెట్ అనంతరం సీఎం అన్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కర్మయోగి ట్రైనింగ్ ప్రోగ్రామ్‌పై కేబినెట్‌లో చర్చించారు. విజన్ 2047పైన మంత్రులతో చర్చించారు. శాఖలకు స్వయంప్రతిపత్తి కల్పించే దిశగా ఆప్కాస్‌ను ఎలా వినియోగించాలి, ఆప్కాస్ పైన మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసే యోచనపై క్యాబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఋషికొండ ప్యాలెస్‌ను వినియోగంలోకి ఎలా తీసుకురావాలి అనే అంశంపై చర్చించాలని తెలిపారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఋషికొండ ప్యాలెస్‌ను సందర్శించి అభిప్రాయలు చెప్పాలని మంత్రులతో ముఖ్యమంత్రి అన్నారు.

**అమరావతిలో సింగపూర్ బృందం .. సీఎం చంద్రబాబు, లోకేశ్‌తో భేటీ :**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆహ్వానం మేరకు సింగపూర్ ప్రతినిధి బృందం బుధవారం అమరావతికి విచ్చేసింది. రాజధాని ప్రాంతంలో నిర్మాణాలను ఈ బృందం పరిశీలించింది. ఈ రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను సింగపూర్ బృందం కలిసి స్టార్టప్ ఏరియా అభివృద్ధి తదితర అంశాలపై చర్చించనుంది. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా అమరావతిలో స్టార్టప్ ఏరియా అభివృద్ధి చేసేందుకు సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం కుదిరింది. 2017 మే నెలలో శంకుస్థాపన చేయడం జరిగింది. అయితే జగన్ హయాంలో ఈ ప్రాజెక్టును రద్దు చేయడంతో పాటు అమరావతి అభివృద్ధిని పక్కన పెట్టారు. మళ్లీ రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో కూటమి అధికారంలోకి రావడంతో అమరావతిలో వివిధ ప్రాజెక్టుల పనులు ఊపందుకున్నాయి. రాజధాని అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సింగపూర్ ప్రభుత్వాన్ని చంద్రబాబు ఆహ్వానించడంతో స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు అభివృద్ధికి మళ్లీ ముందుకొచ్చింది.

## ఇచ్చిన మాట ప్రకారమే పేదలకు...

కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా, 15 సంవత్సరాలుగా కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న రాజమండ్రి గోవిందు కుటుంబానికి స్వయంగా వారి ఇంటికి వెళ్లి కొత్త బట్టలు పెట్టి శాశ్వత పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పేదలకు 'పట్టా'భిషేకం చేస్తున్నామని, ముఖ్యమైన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో అటవీ, దేవాదాయ, రైల్వే, ఇరిగేషన్ భూముల్లో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ప్రజల కష్టాలను చూశానని, వారికి శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించానని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు మూడు విడతలుగా శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామని, మొదటి విడతలో 150 గజాల్లోపు ఉంటున్న 3 వేల మందికి పట్టాలు ఇస్తున్నామని, రెండో విడతలో ఎండోమెంట్స్, రైల్వే భూముల్లో నివసించేవారికి, మూడో విడతలో మిగిలిన వారందరికీ పట్టాలు అందజేస్తామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ, మంగళగిరి ప్రజల మనస్సు గెలుచుకోవడానికి గత ఐదేళ్లుగా తన సొంత నిధులతో 26 సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు లోకేశ్ తెలిపారు. ఉచిత తాగునీటి ట్యాంకర్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణం, కరోనా సమయంలో ఆక్సిజన్, టెలీ మెడిసిన్ సేవలు, ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథాలు, యువత కోసం క్రీడా పోటీలు వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజలు తనపై నమ్మకంతో 91 వేల భారీ మెజారిటీతో గెలిపించారని, ఇది తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. మంగళగిరిలో 50 అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమం ద్వారా పార్కులు, రైతు బజార్లు అభివృద్ధి చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పైప్ లైన్ ద్వారా గ్యాస్ వంటి ప్రాజెక్టులు సిద్ధమవుతున్నాయని, శ్మశాన వాటికలు అభివృద్ధి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. త్వరలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని, చేనేతలకు కామన్ ఫెసిలిటీ సెంటర్, స్వర్ణకారులకు జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంగళగిరిని తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మాకు ఎవరి కితాబు...

వ్యవహారంలో కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. '14వేల ఎకరాలు హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం సేకరించాం. మాకు కూడా ప్రతిఘటన ఎదురైంది. ఒప్పించి.. మెప్పించి.. కోర్టుకు కూడా సరైన వివరాలు సమర్పించి.. కేంద్ర అటవీశాఖ అనుమతులు తీసుకొని గ్రీన్ ఫార్మాసిటీ కోసం భూములు సేకరించాం. ఇవాళ దాంట్లో నువ్వు ఫోర్త్ సిటీయో.. 420 సిటీయో కడుతున్నవ్ అక్కడ. నేను అడుగుతున్న.. 14వేలు నీ చేతుల్లో ఉన్నప్పుడు.. వడ్డించిన విస్తరిలా నీ చేతుల్లో పెట్టినప్పుడు ఈ 400 ఎకరాలపై ఎందుకుపడ్డవ్. నువ్వు కట్టే ఐటీ పార్క్‌లు, ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీ అందులోనే కట్టొచ్చు కదా? అని ప్రశ్నించారు.

**లంగ్స్ స్పేస్ ఎందుకు పాడుచేస్తున్నవ్..?**
'ఫ్యూచర్ సిటీ 14వేల ఎకరాలు పెట్టుకొని.. ప్రసుత సిటీను ఎందుకు ఖరాబ్ చేస్తున్నవ్. అక్కడ ఉన్నదే లంగ్స్ స్పేస్ ఇది ఒకటి. పశ్చిమ హైదరాబాద్‌లో ఒకే ఒక లంగ్స్ స్పేస్‌ని ఎందుకు పాడు చేస్తున్నావని ప్రజలు అడిగేది? పిల్లలు కొట్లాడేది? అక్కడనున్న జంతువులకు నోరు లేదు. నీ మంత్రులు, నీ ఎమ్మెల్యేలకు లేదా? కనీసం ఒక్కరు మాట్లాడుతున్నారా? ఒక్కరికీ బాధ అనిపించడం లేదా? నెమళ్లు అరుస్తుంటే.. పక్షులు మా గూడు చెడగొట్టదని ఏడుస్తుంటే.. దేశం మొత్తం వినపడుతుంది కానీ.. మీకు వినిపించడం లేదు. రేవంత్‌రెడ్డికి చెప్పేది ఒక్కటే. యూనివర్సిటీ అని.. రియల్ ఎస్టేట్ కాదని పిల్లలు ఇస్తున్నరు. దానిపై ప్రెస్‌మీట్లు, ఇష్టం వచ్చిన తిట్లపై చెప్పేందుకు రాలేదు. సూటిగా, స్పష్టంగా ఒకే విషయం చెబుతున్నాం. మళ్లీ మమ్మల్ని ఎవరూ తప్పుపట్టొద్దని కోరుతున్నాం' అన్నారు.

**కొత్తగా మాట్లాడడం లేదు..**
'మా పార్టీ పెద్ద కేసీఆర్ నిన్నా, మొన్న మా పార్టీ సమావేశాలు జిల్లాల వారీగా జరుగుతున్నయ్. నిన్న ముఖ్య నేతలను కేసీఆర్ పిలిచారు. పిల్లలు ఆందోళన చేస్తున్నరు.. ఏ స్టాండ్ తీసుకుంటే బాగుంటుందని కేసీఆర్ చర్చించారు. మేమంతా ఒక నిర్ణయం తీసుకున్నాం. ఆ నిర్ణయాన్ని వెల్లడించేందుకు ప్రత్యేకంగా మీడియా సమావేశం




నిర్వహిస్తున్నాం. మేం అనుకున్నది ఏంటంటే.. హైదరాబాద్‌లో ఈ రోజు కాదు.. మా ట్రాక్ రికార్డ్ చూస్తే.. కొత్తగా పర్యావరణ ప్రేమికులం కాలేదు. కొత్తగా ఏమీ మాట్లాడడం లేదు. మా ప్రభుత్వం ఉన్నప్పుడు చేసిన పనులవల్ల ప్రపంచంలో పారిస్, బొగొటా నగరాలను తలదన్ని గ్రీన్ సిటీ అవార్డును కూడా 2022 బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిపెట్టింది. హరిత విప్లవం సృష్టించింది తెలంగాణ అని చెప్పి ఆ నాడు జాతీయ, అంతర్జాతీయ మీడియా ప్రశంసించింది. మిషన్ కాకతీయ, హరితహారం కార్యక్రమాలతో అద్భుతాలు సృష్టించిందని జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రాశాయి' అని గుర్తు చేశారు.

**మా హయాంలో 7.7శాతం గ్రీన్ కవర్ పెరిగింది..**
'7.7శాతం గ్రీన్ కవర్ పెరిగిందని కేసీఆర్ ప్రభుత్వంలో అని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ఇచ్చిన నివేదిక ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ వెబ్‌సైట్‌లో ముఖ్యమంత్రి గారు చూసుకోవచ్చు. 270 కోట్ల మొక్కలు నాటి హరిత విప్లవాన్ని సృష్టించి ప్రభుత్వం మాది. ఒక పదేళ్లలో భారత్‌లో ఏ మెట్రోనగరంలో గ్రీన్ కవర్ పెరిగిందంటే.. టైమ్స్ ఆఫ్ ఇండియా రిపోర్ట్ డేటా ముంబయి, ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, బెంగళూరులో చూస్తే హైదరాబాద్‌లో కేసీఆర్ ప్రభుత్వం అత్యధికంగా గ్రీన్ కవర్ పెంచిందని తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. భారత్‌లోని 28 రాష్ట్రాల్లో ఎక్కడ గ్రీన్ కవర్ పెరిగిందంటే.. తెలంగాణలో పెరిగిందని పార్లమెంట్‌లో సమాధానం ఇచ్చింది. తెలంగాణలో మా ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రతి పల్లెలలో.. 19,472 పల్లెల ప్రకృతి వనాలు పెట్టింది కేసీఆర్. పల్లెల్లో పచ్చదనాన్ని పెంచింది మా ప్రభుత్వం. మండల స్థాయిలో 6298 ఎకరాల్లో 2011 బృహత్ ప్రకృతి వనాలు పెట్టిందని నాటి కేసీఆర్ ప్రభుత్వం. హైదరాబాద్ చుట్టూ 108 అర్బన్ లంగ్స్ స్పేసెస్ క్రియేట్ చేశాం. లక్షపైచీలుకు పంచాయతీరాజ్ రహదారులపై అవెన్యూ ప్లాంటేషన్ జరిగింది. ఆర్అండ్‌బీ మల్టిపుల్ అవెన్యూ ప్లాంటేషన్ జరిగింది. ప్రతి ఊరిలో నర్సరీ ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. మున్సిపాలిటీలతో 15వేల నర్సరీలు ఉన్నయి. 290 మొక్కలు నాటిన ఒకే ఒక రాష్ట్రం తెలంగాణ. అది మా కమిట్‌మెంట్. కొత్తగా ఇవాళ పర్యావరణంపై మాకు కొత్తగా కితాబులు అవసరం లేదు' అన్నారు.

## అడుదాం ఆంధ్రలో ఎలాంటి...



వ్యవహారంలో తనకు, బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి ఎలాంటి సబంధం లేదని చెప్పారు. ఆడుదాం ఆంధ్రలో అంతా పారదర్శకంగా జరిగిందని తెలిపారు. వైసీపీలో ఉన్న బలమైన నేతలను తొక్కడానికి తప్పుడు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తారనే భయంతోనే కేసులు పెడుతున్నారని విమర్శించారు. తనను అరెస్ట్ చేసి సంబరాలు చేసుకోవాలనే ఆశ వారికి ఉందని చెప్పారు. పేర్ని నాని, కొడాలి నాని, అంబటి రాంబాబును అరెస్ట్ చేయాలని చూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై దారుణాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రోజా విమర్శించారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం కుప్పంలో కూడా గంజాయి పండిస్తున్నారని చెప్పారు. పోలీసులు టీడీపీ కార్యకర్తల్లా మారిపోయారని విమర్శించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల్లో కూడా పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని అన్నారు. రెడ్ బుక్ కోసం కాకుండా... ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వం పని చేయాలని చెప్పారు.

## పోలీసులకు సహకరించని...



వెళ్లారు. కాకాణి నివాసంలో ఓ ఫంక్షన్ కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉదయం నుంచి ఇంట్లోనే ఉన్న ఆయన.. పోలీసులు వస్తున్నారని తెలుసుకుని అక్కడి నుంచి జంప్ అయ్యారు. తీరా అక్కడకు వెళ్లిన పోలీసులు నిరాశే ఎదురైంది. కాకాణి లేదని తెలుసుకున్న పోలీసులు అక్కడ ఆయన బంధువులకు నోటీసులు ఇచ్చి వెళ్లారు. అక్రమ మైనింగ్ కేసులో ఏప్రిల్ 3న (గురువారం) నెల్లూరు రూరల్ డీఎస్పీ ఎదుట విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈసారి కచ్చితంగా విచారణ రావాలని పోలీసులు స్పష్టం చేశారు. అయితే మూడో సారి కూడా సేమ్ సీన్ రిపీట్ అయ్యింది. మూడవ సారి కూడా పోలీసుల విచారణకు డుమ్మా కొట్టారు మాజీ మంత్రి. పోలీసుల విచారణకు అస్సలు సహకరించకుండా కాకాణి హైడ్రామా ఆడుతున్న పరిస్థితి. ఇటీవల పోలీసు అధికారులను తీవ్రస్థాయిలో బెదిరించి, దూషించారు కాకాణి. గతంలోనూ ఓ కేసులో ఇదే తరాహాలో కాకాణి హైడ్రామా చేసిన విషయం తెలిసిందే. చివరకు సుప్రీం కోర్టులో ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. ఇప్పుడు కాకాణిపై అక్రమ మైనింగ్ కేసుతో పాటు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు అయ్యింది. పరారీలో ఉంటూనే ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ కోసం కాకాణి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఓవైపు పోలీసుల నుంచి తప్పించుకుని బెయిల్ తెచ్చుకునేందుకు కాకాణి విశ్వ ప్రయత్నం చేస్తుండగా.. ఎలాగైన కాకాణిని విచారించాలని పోలీసులు కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పుడు మూడవ సారి కూడా కాకాణి విచారణకు రాలేని నేపథ్యంలో పోలీసులు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

## ట్రంప్ విధించిన సుంకాలపై ...

భూభాగాన్ని త్వరగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం అక్కడి రాయబారి ద్వారా వెలుగులోకి వచ్చిందని తెలిపారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ప్రతిస్పందించారు. ఏ ప్రభుత్వ హయాంలో చైనా ఈ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకుందో అందరికీ తెలుసని అన్నారు. డోక్లాం ఘటన జరుగుతున్న సమయంలో బీజింగ్ అధికారులతో కలిసి ఎవరు సూప్ తాగారో కూడా తెలుసని ఠాకూర్ విమర్శించారు. ఇలాంటి అంశాలను రాజకీయం చేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని, గతంలో జరిగిన తప్పిదాలకు కాంగ్రెస్ సమాధానం చెప్పాలని నిలదీశారు.

## అవినాశ్ బెయిల్ పై ఉండటం వల్లే...



అన్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్నవారు సునీతను ఏమైనా చేస్తారనే భయం తమలో ఉందని చెప్పారు. ఇటీవల తనకు కొన్ని విషయాలు తెలిశాయని... అవి తనను ఆలోచింపజేస్తున్నాయని అన్నారు. సునీతకు ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పారు. అవినాశ్ బెయిల్ రద్దు చేయాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్ లో పలు విషయాలను పేర్కొందని షర్మిల తెలిపారు. విచారణ అధికారులను అవినాశ్ పిలిపించుకుని బెదిరించినట్టు అఫిడవిట్ లో ఉందని... తప్పుడు రిపోర్టుపై అధికారులతో అవినాశ్ సంతకాలు చేయించినట్టు ఉందని చెప్పారు. అవినాశ్ బెయిల్ పై ఉండటం వల్లే సునీతకు న్యాయం జరగడం లేదని అన్నారు. వివేకాను సునీత, ఆమె భర్త చంపించినట్టు తప్పుడు రిపోర్టు ఇచ్చారని తెలిపారు. హత్య జరిగినప్పుడు ఘటనాస్థలిలో ఉన్నది అవవినాశ్ రెడ్డేనని చెప్పారు.

## తాగునీటి సమస్యను ......
# పరిష్కరించిన ఎంపీపీ యువరాజ్



వి.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 03: వీకోట మండలం చింతమాకులపల్లి పంచాయతీ కుదువగడ్డ గ్రామస్తులు నెల రోజుల నుంచి త్రాగు నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నామని ఎంపీపీ మరియు వైస్సార్సీపీ మండల అధ్యక్షులు, కే.యువరాజ్ దృష్టికి తీసుకురావడంతో.... వారు వెంటనే స్పందించి మండల గ్రాంట్లో నిధులు మంజూరు చేసి నేడు నూతన బోరు వేయడానికి స్వీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంచంద్రప్ప మరియు వైస్సార్సీపీ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ సమేతంగా దర్శించుకున్న......
# తెలుగు సినిమా హీరోయిన్ పూజ హెగ్డే



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 03: శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల దర్శనార్థమై తెలుగు సినిమా హీరోయిన్ పూజ హెగ్డే కుటుంబ సమేతం గా విచ్చేశారు. వీరికి శ్రీకాళహస్తి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ప్రత్యేకదర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం మేధా గురుదక్షిణా మూర్తి సన్ని ధానం వద్ద శేషవస్త్రంతో సత్కరించి వేద పండితులచే ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను అందచేశారు. ఈ కార్యక్ర మంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ హరి యాదవ్ , ఏపీఆర్ఓ రవి ,ఆలయ అధికారులు సిబ్బంది ,వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

# డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 03: శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా ఆధ్వర్యంలో ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ స్ఫూర్తి తో శ్రీకాళహస్తి పట్టణం నందు ప్రతి గురు వారం మధ్యాహ్నం బస్టాండ్ సెంటర్లో అన్న దాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 38 వ వారం బస్టాండ్ సెంటర్లో అన్నదానం నిర్వ హించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల ఇంచార్జ్ పేట చంద్ర శేఖర్, రిటైర్డ్ ఎమ్మార్వో చంద్రశేఖర్,పట్టణ ప్రధాన కార్యదర్శి పేట చిరంజీవి,సురేష్, వెంకటరమణ యాదవ్,లక్ష్మణ్,ముని చంద్ర,ప్రదీప్ కుమార్,దినేష్,ప్రభాకర్,ముని కుమార్,సాయి,చందు,వీర మహిళలు, లక్ష్మి,రాజ్యలక్ష్మి,శారద,గాయత్రి,బత్తేమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

## శ్రీవిజయలక్ష్మి టవర్స్ గృహప్రవేశానికి ......
# అందరూ విచ్చేయండి..



వి.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 03: చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం వీకోట మండలం నాయక నేరీ రోడ్ దుర్గా నగర్ లో మా చేత నూతనంగా నిర్మించబడిన శ్రీ విజయలక్ష్మి టవర్స్... నూతన గృహప్రవేశానికి మండలంలోని యావత్ ప్రజానీకానికి పేరుపేరునా ఆహ్వానిస్తున్నాము కావున మా ఆహ్వానాన్ని మన్నించి ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని, మా ఆతిథ్యం స్వీకరించి మమ్ములను మీ... నిండు మనసులతో ఆశీర్వదించాలని, తెలియజేస్తున్నామని శ్రీ విజయలక్ష్మి గ్రూప్స్ అధినేత డాక్టర్ ఎస్ ఆర్ దామోదర్ రెడ్డి పత్రికా ముఖంగా తెలియజేసినారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి .....
# చెక్కు పంపిణీ చేసిన టిడిపి నాయకులు



కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 03: ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం,టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు సహాయ సహకారాలతో షమీం, రమాదేవి, జీవరత్నం ల వైద్య సేవల నిమిత్తం కుప్పం నియోజకవర్గ శాసన సభ్యులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కురూపంలో మంజూరు చేసిన సొమ్మును కుప్పం పురపాలక సంఘం టిడిపి అధ్యక్షులు రాజకుమార్, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, కొత్తపేట ఇన్చార్జ్ ముఖేష్ (అప్పు), 13వ వార్డు కన్వీనియర్ మణి, 13వ వార్డు పార్టీ అధ్యక్షులు లోకేష్, ప్రధాన కార్యదర్శి భరత్,నాయకులు శ్రీనివాసులు,సోమశేఖర్ లు కలిసి ముఖ్య మంత్రి మంజూరు చేసిన చెక్కును లబ్ధిదా రులకు అందజేయడం జరిగింది.

# వక్ఫ్ సవరణ బిల్లు లోకసభ ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేసిన కోలా ఆనంద్

## అగ్రగామిక దేశంగా అవతరించే దిశగా “మోదీ సంకల్పమే వక్ఫ్ సవరణ బిల్లు



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 03: శ్రీకాళహస్తి గురువారం బిజెపి పార్టీ కార్యాలయం నందు విలేకరుల సమావేశం నిర్వహించి బిల్లుకు మద్దతు ఇచ్చిన కూటమి అధినేతలు నారా చంద్రబాబు నాయుడు , కొణిదల పవన్ కళ్యాణ్ ఘనంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ అధికార విపక్షాల మధ్య రాజ్యసభలో 12 గంటల పాటు జరిగిన వాడి వేడీ చర్చ అనంతరం వక్ఫ్ సవరణ బిల్లును లోక్ సభ ఆమోదించింది. రాజ్యసభలోని ప్రజాప్రతినిధులు బిల్లుకు అనుకూలంగా 288 ఓట్లు రాగ వ్యతిరేకంగా 232 ఓట్లు పడ్డాయి. బిల్లులో ప్రతిపక్షాలు చేసిన అన్ని సవరణలను సభ తిరస్కరించింది. బిల్లును అధికార ఎన్డీఏ సమర్థించుకోగా, మైనార్టీలకు భారత్ ను మించిన సురక్షితమైన దేశం మరొకటిలేదని, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టంచేశారని. ఎన్డీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్లో సైతం ఈ సవరణ బిల్లుకు ఎన్డీఏ ప్రభుత్వం మద్దతు తెలియజేయడంపై ఆయన ఎన్డీఏ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. అయితే కొంతమంది ప్రతిపక్ష నాయకులు కావాలనే వారి స్వలాభాల కోసం మైనార్టీలను రెచ్చగొడుతూ ఈ సవరణ బిల్లుపై అపోహలు సృష్టిస్తున్నారని, అయితే దేశంలోని ముస్లింలంతా నేడు బిజెపికే మద్దతు తెలియజేస్తున్నారని, ఎక్కడ చిన్నపాటి వ్యతిరేకం కనిపించడం లేదని ఈ వక్ఫ్ సవరణ బిల్లు వల్ల ముస్లింలకు పూర్తి న్యాయం జరుగుతుందని తెలియజేశారు. దేశంలోని ప్రజలందరకు ఒకే న్యాయం, ఒకే చట్టం ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు పనిచేస్తుందని, దేశంలో ముస్లింలకు ఉన్న వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం అవుతుండడంతో, కేంద్రం అందరికీ ఒకే చట్టం తీసుకుని వచ్చే విధంగా అటు రాజ్యసభలోను ఇటు శాసనసభలో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఆమోదం తెలుపుతూ తీసుకున్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీఏ ప్రభుత్వం మద్దతు తెలియజేయడం ప్రతి ఒక్కరు స్వాగతించాలన్నారు. ముస్లిం మహిళలకు, పేదలకు, యువతకు వక్ఫ్ బోర్డు ద్వారా వారికి సంబంధించిన ఆస్తులను కోల్పోకుండా, వారికి న్యాయం జరిగే విధంగా కార్యాచరణ చేపట్టాలని ఉద్దేశంతోనే నేడు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని కేంద్ర ప్రభుత్వం ఏ మతానికి, ఏ కులానికి వ్యతిరేకం కాదని, అందరికీ ఒకే చట్టం, ఒకే న్యాయం కలిగించే విధంగా కార్యాచరణ చేపట్టడమే కేంద్ర ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్, జిల్లా కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, రాష్ట్ర సభ్యులు ఎస్వీ రమణ, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి గోపాల్, కుప్ప ప్రసాద్ రాయల్, మండల అధ్యక్షులు వేడం కృష్ణయ్య, నానీ తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగులకు చిత్రపటాలు వితరణ



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 03: శ్రీకాళహస్తి విశ్రాంత ఉద్యోగుల కు శ్రీకాళ హస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు దేవుడా చిత్రపటాలను బహుకరించారు. పెన్షనర్స్ డే ను పుర స్కరించుకుని శ్రీకాళహస్తి విశ్రాంతి ఉద్యోగు ల సంఘం ఆధ్వర్యంలో రిటైర్డ్ అయి 15 ఏళ్లు పూర్తి చేసుకున్న విశ్రాంతి ఉద్యోగుల కు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు తన మాతృమూర్తి స్వర్గీయ ఉపాధ్యాయురాలు సరోజనమ్మ జ్ఞాపకార్థం గత 20 సంవత్స రాలుగా దేవుడు చిత్రపటాలను రిటైర్డ్ ఉద్యోగులకు బహుకరించి ఘనంగా సత్క రించడం నిర్మిస్తున్నారు. ఈ చిత్రపటాలను అధ్యక్షులు వెంకయ్య, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి వెంకట రమణయ్య వీరికి అందజేశారు. ఈ యాంత్రిక జీవితం లో15 ఏళ్లు పూర్తి చేసుకున్న విశ్రాంతి ఉద్యో గులకు తల్లి జ్ఞాన ప్రసూనాంబికా దేవి సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల చల్లని దీవెనలు ఉండాలని కోరుకుంటు న్నాను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ యువత అధ్యక్షులు శ్రీవారి సురేష్,ముని,వేలూరు రమేష్,తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యలు పరిష్కారంలో అలసత్వం వీడండి...

## సమస్యల పరిష్కారానికి శ్రద్ధ పెట్టండి... జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 03: రెవెన్యూ సమస్యల పరిష్కారంనకు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలని నిర్లక్ష్యంవహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. గురు వారం కుప్పం ఎంపీడీఓ కార్యాలయంలో కుప్పం నియోజకవర్గం నకు సంబంధించి కుప్పం, గుడిపల్లి రామకుప్పం, శాంతిపురం మండలాల తహసీల్దార్ లు డీటీలు ఆర్ ఐ లు, వీఆర్ఓ లతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రెవెన్యూ అధికారులు, సిబ్బంది వారి పరిధిలో గల గ్రామాల వారీ గా అందిన సమస్యలను పరిష్కరించేందు కు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలన్నారు. రెవిన్యూ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజలు రెవెన్యూ కార్యాలయాలకు రావడం జరుగుతుందని, అలా వచ్చినవారితో మర్యాద పూర్వకంగా మాట్లాడి వారి సమ స్యలను తెలుసుకొని పరిష్కరించే విషయంలో చొరవ చూపాలన్నారు. నియమని బంధనలకు లోబడి సమస్యల నుపరిష్క రించాలని,పరిష్కారం చేయడం లో కాలయాపన తగదని,ఇలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అందిన అర్జీలను నిర్దేశించిన సమయానికి పరిష్కా రమయ్యే సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం వహించి బాధ్యత రాహి త్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరు గుతుందని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకంగా అధికారులు పనిచేయాలని తెలిపారు. వెబ్లాండ్ ప్యూరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు.ప్రభుత్వ స్థలాలను గుర్తించడం జరిగిందని వాటిని పరిరక్షిం చాలన్నారు.ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసే సరుకులను సకాలంలో కార్డు దారులకు అందజేయాలన్నారు.ఈ సమా వేశంలో భాగంగా మండలాల వారీగా మ్యూటేషన్ లు,ఎఫ్ లైన్ పిటిషన్, ఆర్ ఓ ఆర్ సంబంధిత అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు,డి ఎస్ ఓ శంకరన్,కుప్పం, గుడిపల్లి,రామకుప్పం,శాంతిపురం తహ సిల్దార్ లు చిట్టిబాబు, సీతారాం,కౌలేష్, శివయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కుప్పం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నూలుకుంట మునుస్వామి ఎన్నిక

## నాలుగు మండలాలకు అధ్యక్షులను ఎంపిక చేసిన కాంగ్రెస్ పార్టీ






కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 03: కుప్పం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా రెండవసారి కుప్పం మండలం నూలుకుంట మునుస్వామి ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిత్తూరు డిసిసి అధ్యక్షులు పోటుగారి భాస్కర్ నుండి నియామక పత్రం అందుకున్నారు. ఏపీ సి సి అధ్యక్షురాలు శ్రీమతి వైయస్ షర్మిల ఆశీస్సులతో కుప్పం నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ ఆవుల గోపి సహకారంతో ఎన్నిక జరిగిందని మునస్వామి ఓ ప్రకటన లో తెలిపారు.కుప్పం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా ఎస్ నిజాం, శాంతిపురం మండలానికి అబకలదొడ్డి గ్రామానికి చెందిన నంజప్ప, రామకుప్పం మండలానికి బగళనత్తం గ్రామానికి చెందిన వి సుబ్రహ్మణ్యం, గుడిపల్లి మండలానికి నలగం పల్లి గ్రామానికి చెందిన ఎం కృష్ణప్పను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అధ్యక్షులుగా నియమించింది. తమపై ఎంతో నమ్మకంతో ఈ పదవిని అప్పజెప్పిన అధిష్టానానికి ఇందుకు సహకరించిన జిల్లా నేతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## మేరీయా చారిటబుల్ అండ్
## ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..
# ఉచిత వైద్య శిబిరం


శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 03: కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం రాళ్ల బూదుగురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రేస్ మేరీయా చారిటబుల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాదాపు 250 మంది పిల్లలకు ఉచిత వైద్య శిబిరం అందించడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో కంటి సమస్యలు, పీడియాట్రిక్, జనరల్ మెడిసిన్ తో పాటు పిల్లలకు మందులు కూడా అందించారు.అలాగే ఈ కార్యక్రమం లో ట్రస్ట్ సెక్రెటరీ అయినా జేసు మేరీ, పాఠశాల సిబ్బంది అయినా రవి, సిద్ధారెడ్డి,లోకేష్ తదితరా ఉపాధ్యా యులు,మరియు పిఎస్ సిబ్బంది,ట్రస్ట్ స్టాఫ్ పాల్గొన్నారు.




## చంద్రబాబు నాయుడుని....
# కలిసిన గంధమనేని

ఎస్ ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 03: ఎస్ఆర్పురం టిడిపి మండల పార్టీ అధ్యక్షు డు గంధమనేని జయశంకర్ నాయుడు గురువారం అమరావతి సెక్రటేరియట్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపా ధ్యక్షుడు నిరంజన్ రెడ్డి కలిశారు.



# యదేచ్చగా ఎస్సీ/ఎస్టీ భూములు కబ్జా



పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 03: అన్నమయ్య జిల్లా పీలేరు మండలం లో నిరుపేదలైన ఎస్సీ /ఎస్టీల భూములు యదేచ్ఛగా కబ్జాలకు గురయ్యాయని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ ధ్వజమెత్తారు. పీలేరు మాలమహానాడు కార్యాలయంలో మండల యూత్ ప్రెసిడెంట్ జెట్టి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ గతంలో హీనజాతుల కింద ప్రభుత్వం భూమి ఇచ్చింది. భూ బకాసురు లైన అగ్ర కుల పెత్తందారులు ఎ రాజకీయ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీనీ అడ్డుపెట్టు కొని అప్పుడు ఇప్పుడు ఎప్పుడైనా వారు ఆక్రమించేది ఎస్సీ/ఎస్టీ భూములు ఆక్ర మించుకొని వారిని ఆ భూమిలోకి అడుగు పెట్టనీయకుండా అగ్రకులాల పెత్తందారులు అడ్డుకుంటే అంగబలం,ఆర్థికబలం, రాజకీ య బలం లేని ఎస్సీ/ఎస్టీ లకు రాజ్యాంగం లోని చట్టాలను అమలుచేయడంలో ఇంత వరకు ఎ ప్రభుత్వం పురోగతి సాధించలేదు హక్కుదారులైన ఎస్సీ/ఎస్టీలకు ఆ భూమి ని అప్పగించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్న రాజకీయ ప్రలోబాలకు తలోగ్గి అగ్రకు లాల పెత్తందారులకు సహాయ సహకారా లు అందిస్తున్న నేపథ్యంలో ఎస్సీ/ఎస్టీల పేరుతో బోగస్ పట్టాలు పొందారున్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు కార్యవర్గ సభ్యులు గంగారపు వెంకటేష్, గంగారపు గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# సిఎన్ఆర్ కళాశాలలో జాబ్ మేళా

## జాబ్ మేళాలో 29 మంది ఎంపిక



పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 03: అన్నమయ్య జిల్లా పీలేరులోని సిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో మద్రాసు కు చెందిన ఏ ఆర్ కె హెచ్ ఆర్ సొల్యూషన్స్ అండ్ సర్వీసెస్ గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 48 మంది పాల్గొనగా వివిధ దశలలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో 29మంది ఎంపికైనట్లు సిఎన్ఆర్ కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. ఎన్నికైన అభ్యర్థులకు హెచ్ ఆర్ మేనేజర్ కుసుమ మరియు సురేష్ కుమార్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఎంపికైన అభ్యర్థులకు రెండు లక్షల వార్షిక వేతనం అందుతుంది. ఈ కార్యక్రమంలో సిఎన్ఆర్ కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్య,అధ్యాపకులు పాల్గొని ఉద్యోగాలకు ఎన్నికైన అభ్యర్థులను అభినందించారు.

## లోక ఫౌండేషన్ ఆధ్వర్యంలో....
# నోటుబుక్కులు పంపిణీ

బుచ్చినాయుడు కండ్రిగ,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 03: బుచ్చినాయుడు కండ్రిగ మండలం తలారివేట్టు పంచాయతీ ఎన్టీఆర్ నగర్ గ్రామంలో లోక ఫౌండేషన్ వారి ఆధ్వర్యం లో గ్రామ ప్రజల సహకారంతో అనేక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా ఎన్టీఆర్ నగర్ గ్రామం పాఠశాలలో 30 విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్నులు పెన్సిల్లు పంపిణీ చేశారు. అంతే కాకుండా స్కూల్ పిల్లలకు సాయంత్రం ట్యూషన్ నడిపిస్తున్నారు. ట్యూషన్ నిర్వ హణలో భాగంగా ఒక విద్యా వాలంటరీ నియమించి లోక ఫౌండేషన్ వారే జీతభ త్యాలు చెల్లిస్తున్నారు .లోక ఫౌండేషన్ లోక ఫౌండేషన్ ఈ కార్యక్రమంలో తలారివెట్టు, ఎన్టీఆర్ నగర్ యూత్, పాల్గొన్నారు.







# హిందూ ఆలయాల్లో డ్రెస్ కోడ్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన రకుల్ ప్రీత్ సింగ్..!

దేశవ్యాప్తంగా హిందూ ఆలయాల్లో కొత్త మార్గదర్శకాలు అమలులోకి వచ్చాయి. సంప్రదాయ దుస్తులు ధరించి మాత్రమే ఆలయ ప్రవేశం చేసేందుకు అనుమతి ఉన్నది. ఈ క్రమంలో ఆలయాల్లో సంప్రదాయ వస్త్రధారణ ఆవశ్యకతపై హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. ఆధ్యాత్మిక ప్రదేశాల్లో అందరూ సరైన వస్త్రాలు ధరించాలని సూచించింది. ల్యాక్మే ఫ్యాషన్ వీక్‌లో రకుల్ ఈ వ్యాఖ్యలు చేసింది. పబ్లిక్ ఫిగర్‌గా మనం ఏ పని చేసినా బాధ్యతాయుతంగా చేయాలనేది తన అభిప్రాయమని పేర్కొంది. ఫ్యాషన్ విషయానికి వస్తే సందర్భాన్ని బట్టి మన డ్రెస్సింగ్ ఉండాలని అభిప్రాయపడింది. దేవాలయానికి వెళ్లే సమయంలో.. అందుకు తగినట్లుగా సాంప్రదాయ వస్త్రధారణ ఉండాలని తెలిపింది. జిమ్‌కు వెళ్లిన సందర్భంలో వర్కట్స్‌కు వీలుగా డ్రెస్‌లు వేసుకోవాలని.. డిన్నర్‌కి వెళ్లిన సమయంలో ఆ సందర్భానికి అనుగుణంగా డ్రెస్ ధరించాలని సూచించింది. సందర్భానికి అనుగుణంగా వస్త్ర ధారణ ఉండాలని తెలిపింది. ఇదిలా ఉండగా.. దేశవ్యాప్తంగా ప్రముఖ ఆలయాల్లో భక్తులకు డ్రెస్ కోడ్ అమలు అవుతున్న విషయం తెలిసింది. ఈ ఏడాది జనవరిలో ముంబయిలోని ప్రముఖ సిద్ధి వినాయక ఆలయంలోనూ డ్రెస్ కోడ్‌ని అమలులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. పురుషులు ధోతీ, పంచె ధరించాలని, మహిళలు సారీ, సల్వార్ కమీజ్ ధరించాలని భారతీయ సంప్రదాయ వస్త్రాలను మాత్రమే ధరించి ఆలయానికి రావాలని ఆలయ ట్రస్ట్ తెలిపింది. ఆలయ ప్రాగణంలో పొట్టి దుస్తులు, శరీరాన్ని స్పష్టంగా చూపించే దుస్తులు ధరించి రావడాన్ని నిషేధించారు. భక్తులు సంప్రదాయ దుస్తుల్లో మాత్రమే ఆలయానికి రావాలని ఆంక్షలు విధించింది. ఇప్పటికే తమిళనాడు, ఏపీ, తెలంగాణ, కేరళలోని ప్రముఖ ఆలయాల్లో డ్రెస్ కోడ్ నిబంధన అమలులో ఉంది. ఇదిలా ఉండగా.. రకుల్ సినిమాల విషయానికి వస్తే.. చివరిసారిగా భారతీయుడు-2 మూవీలో కనిపించింది. ప్రస్తుతం తమిళ సినిమా భారతీయుడు-3, హిందీలో దే దే ప్యార్ దే మూవీలో నటిస్తున్నది. చివరిసారిగా తెలుగులో 2011లో కొండపొలం సినిమాలో నటించింది. ఆ తర్వాత నేరుగా తెలుగులో సినిమాలు చేయలేదు. కేవలం బాలీవుడ్‌తో పాటు తమిళంలోనే చిత్రాలు చేస్తూ వస్తున్నది.

# యాంకర్ ప్రదీప్‌కి ఫైనాన్షియల్ సమస్యలా.. ఇంటర్వ్యూలో స్వయంగా వెల్లడి




బుల్లితెర యాంకర్ ప్రదీప్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. పంచులు, ప్రాసలు, జోకులతో పలు టీవీ షోలను సక్సెస్ ఫుల్ గా రన్ చేసిన అతను పలు సినిమాలలో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కూడా పని చేశారు. ఇక ఆ తర్వాత హీరోగా మారాడు. 30 రోజుల్లో ప్రేమించడం ఎలా సినిమాతో హీరోగానూ మారిన ప్రదీప్ ఈ సినిమాతో మంచి హిట్ అందుకోలేకపోయాడు. ఇందులోని పాటలు సూపర్ హిట్ గా నిలిచినా మూవీ మాత్రం ఆ రేంజ్ లో మెప్పించలేకపోయింది. ఇప్పుడు ప్రదీప్ మరో సినిమాతో ప్రేక్షకులని పలకరించేందుకు సిద్ధమయ్యాడు. గత కొద్ది రోజులుగా షోస్‌కి కూడా దూరంగా ఉంటూ అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి అనే సినిమా కోసం పని చేస్తున్నారు. ఈ మూవీ ఏప్రిల్ 11న రిలీజ్ కానుంది. ప్రస్తుతం మూవీ యూనిట్ ప్రమోషన్స్ తో బిజీగా ఉంది. తాజాగా ట్రైలర్ కూడా రిలీజ్ చేశారు. ఇది ఆసక్తికరంగా ఉంది.ఇక ప్రదీప్ చిత్ర ప్రమోషన్‌లో భాగంగా పలు ఇంటర్వ్యూలకి హాజరై ఆసక్తికర విషయాలు తెలియజేస్తున్నారు. అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమాకి ఒక్క రూపాయి కూడా రెమ్యునరేషన్ తీసుకోలేదు. ఈ సినిమాకు నా చిన్నప్పటి ఫ్రెండ్స్ నలుగురు నిర్మాతలుగా మారారు. వారితో పాటు నేను కూడా కొంత డబ్బు పెట్టాను. అందుకే రెమ్యునరేషన్ తీసుకోలేదు. సినిమా రిలీజ్ అయి మంచి ప్రాఫిట్స్ వస్తే అందులో ఎంతో కొంత తీసుకుంటాను. గత రెండేళ్లుగా షోలు కూడా రెగ్యులర్ గా చెయ్యట్లేదు కాబట్టి ఫైనాన్షియల్ ప్రాబ్లమ్స్ వచ్చాయి. అయితే అవన్నీ మేనేజ్ చేసాను. ఇప్పుడు మాత్రం ప్రదీప్ ఆశలు అన్ని కూడా అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమాపైనే ఉన్నాయి. మరి ఈ సినిమా తర్వాత అయిన ప్రదీప్ షోస్ చేస్తాడా లేదంటే మరో సినిమా మొదలు పెడతాడా అనేది చూడాలి. 'పవన్ కళ్యాణ్ నటించిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' సినిమా టైటిల్ ను తన మూవీకి పెట్టడంపై స్పందించిన ప్రదీప్.. ఆ సినిమాకి నా సినిమాకి సంబంధమే ఉండదు అని అన్నాడు. ఫస్ట్ స్టోరీ చెప్పినప్పుడే మూవీకి ఈ టైటిల్ అని చెప్పారు. కథకి సరిగ్గా సరిపోయే టైటిల్ ఇది. పవన్ మూవీ పేరు కాబట్టి కాస్త భయం కూడా ఉంది. ఆ పేరు చెడగొట్టకుండా జాగ్రత్తగా తీసాం. పవన్ ఫ్యాన్స్ కి కూడా ఈ సినిమా నచ్చుతుంది అని ప్రదీప్ పేర్కొన్నారు.

# సల్మాన్ ఖాన్ ఈద్ పార్టీ.. ఏయే సెలబ్రిటీలు హాజరయ్యారంటే..!



బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్ ప్రతి ఏడాది ఈద్‌ని ఎంతో ఘనంగా జరుపుకుంటాడన్న విషయం తెలిసిందే. అంతేకాకుండా ఈద్‌కి తన సినిమా రిలీజ్ అయ్యేలా ప్లాన్ చేసుకుంటాడు. తాజాగా సికందర్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాగా, ఈ మూవీ అంతగా అలరించలేకపోయింది. అయితే సల్మాన్ ఖాన్ తన ఇంట ఈద్ పార్టీ నిర్వహించగా, ఈ కార్యక్రమంలో సంప్రదాయ దుస్తులు కాకుండా కార్టూన్ థీమ్ పాంట్ ఒకటి ధరించి భారీ భద్రత మధ్య కనిపించాడు. ఇక పార్టీకి సోనాలి బెంద్రే పింక్ మరియు బ్లూ టోన్డ్ సల్వార్ సూట్ ధరించి హాజరైంది. ఇక సోనాక్షి సిన్హా తన భర్త జహీర్ ఇక్బాల్‌తో కలిసి సల్మాన్ ఖాన్ ఈద్ బాష్‌కు హాజరైంది. ఈ జంట కలిసి ప్రత్యేకంగా ఫొటోలకి పోజులిచ్చారు. ఇక బబ్లీ గార్ల్ జెనీలియా డిసౌజా రితేష్ దేశ్‌ముఖ్‌తో కలిసి పార్టీకి హాజరైంది. జెనీలియా లేత బంగారు రంగు అద్దాలతో ఉన్న సల్వార్ సూట్‌లో మెరిసింది.ఆమె భర్త రితేష్ బ్లాక్ కుర్తా ధరించి క్యూట్‌గా కనిపించారు. షమితా శెట్టి లేత బంగారు రంగు డ్రెస్ ధరించి, వాటికి చోకర్‌తో జత చేసి, పాపరాజీలకు ఫోజులిస్తూ క్యూట్‌గా కనిపించింది. ఇక మలైకా అరోరాతో అర్బాజ్ ఖాన్ కుమారుడు అర్హాన్ ఖాన్ బ్లాక్ కుర్తా ధరించి అంకుల్ సల్మాన్ ఖాన్ ఈద్ పార్టీకి స్టైల్‌గా హాజరయ్యాడు. సల్మాన్ ఖాన్ సోదరి అర్పితా ఖాన్ ఎరుపు రంగు సల్వార్ సూట్ ధరించి సల్మాన్ ఖాన్ ఈద్ పార్టీకి హాజరై ఫొటోలకి ఫోజులిచ్చింది.మొత్తానికి సల్మాన్ ఇంట జరిగిన ఈద్ బాష్‌కి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాని షేక్ చేస్తున్నాయి. ఇక ఇదిలా ఉంటే సల్మాన్ ఖాన్ నటించిన సికందర్ చిత్రాన్ని మురుగదాస్ తెరకెక్కించగా, ఈ చిత్రం మార్చి 30న విడుదలైంది. తొలి రోజు ఈ చిత్రం ఇండియా వ్యాప్తంగా 30 కోట్ల రూపాయల వసూళ్లు రాబట్టగా, గ్లోబల్‌గా 50 కోట్లు రాబట్టినట్టు తెలుస్తుంది.

# రొమాంటిక్ బృందావనం..

నూతన నటీనటులు బాలు, షిన్నోవాలా నటించిన చిత్రం 'ఒక బృందావనం'. బొత్స సత్య దర్శకత్వంలో కిషోర్ తాటికొండ, వెంకట్ రేగట్టే, ప్రహ్లాద్ బొమ్మినేని, మనోజ్ ఇందుపూరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. వినోదంతోపాటు అర్థవంతమైన సందేశాన్ని కూడా మేళవించి ఈ సినిమా తెరకెక్కించామని, త్వరలో ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టనున్నామని, కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు ఈ సినిమా తప్పక నచ్చుతుందని నిర్మాతలు తెలిపారు. శుభలేఖ సుధాకర్, అన్నపూర్ణమ్మ, శివాజీరాజా, రూపలక్ష్మి, సాన్విత, కల్యాణి రాజు, మహేంద్ర, డి.డి.శ్రీనివాస్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాజ్ కె.నల్లి, సంగీతం: సన్నీ, సాకేత్.



OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036